# సహస్ర నామార్చన

సింహప్రసాద్

మొఖం వేలాడేసుకు వచ్చిన కొడుకుని చూసి "వెళ్ళిన పని అవ్వనట్టుందే" అన్నారు భూపతిరావు గారు.

"అవ్వలేదు. కాలేజీ కమిటీ వైస్ ఛైర్మన్ దగ్గర్నుంచి లెటర్ తీసుకెళ్ళేను. అయినా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదు. ఈ కొత్త ప్రిన్సిపాల్ అదో రకం మనిషి నాన్నగారూ. ప్రతిదానికీ రూల్సుని వల్లిస్తూంటాడు..."

"తిండిపోతేమో"

"అబ్బే – ఫలం, పత్రం, పుష్పం, తోయం దేనికీ లోబడడు. అదోరకం పెంకిఘటం."

"నేను కలిసి చూస్తానుండు" పైపంచె భుజానేసుకుని చేతికర్ర వూపించుకుంటూ కాలేజీకి బయల్దేరారు.

కాలేజీ ఆవరణలో ఓ కుర్ర లెక్చరర్ ఆయన్ని విష్ చేశాడు. ఆయనద్వారా ఆ వుద్యోగం సంపాదించుకున్నాడతడు.

"ఏమోయ్! ఎలా వుంది నీ ఉద్యోగం? మీ కొత్త బాస్ ఏమంటున్నాడు?"

"డిసిప్లిన్ అని అరుస్తున్నాడండీ తనకీ ముందు పనిచేసిన వాళ్ళంతా అసమర్థులని ఆయన నిశ్చితాభిప్రాయం. అంచేత స్టాఫ్‌ని ఆ డిపార్ట్‌మెంటునుంచి ఈ డిపార్ట్‌మెంటుకీ, ఇక్కడ్నుంచి అక్కడికీ మార్చేస్తున్నాడు. మొక్కల పూలు కొయ్యకూడదు, ఎక్కడ బడితే అక్కడ సైకిళ్ళు పెట్టకూడదు, గుంపులు గుంపులుగా వుండకూడదంటూ రూల్సు, రెగ్యులేషన్సూ దంచేస్తున్నాడండీ. పడ్డగొడ్డుకి అరుపు లెక్కువన్నది మీకు తెలీందికాదు"

"చూద్దాం"

చిన్నగా నవ్వుకొని కాలేజీని, పరిసరాల్ని ఓమారు పరికించి తిన్నగా ప్రిన్సిపాల్ గదిలోకెళ్ళి విష్ చేశారు.

ఆయనో పెద్దమనిషిలా కన్పించేసరికి కూర్చోమని కుర్చీ చూపి "చెప్పండి" అనడిగారు ప్రిన్సిపాల్ చిదంబరం.

భావరహితంగా, బ్లాంక్‌గా వున్న ఆయన మొహాన్ని, సూటిగా విషయానికొచ్చే అతడి తత్వాన్ని, క్లుప్తతనీ చూసిన వెంటనే గ్రహించేశారు భూపతిరావుగారు ఆయన అదో తరహా మనిషని.

"నేను మాజీ కమిటీ మెంబర్నిలెండి మీరు కొత్తగా వచ్చేరని తెలిసి చూద్దామని వచ్చాను"

"ఐసీ" ఈ ఉపోద్ఘాతం వింటోంటేనే తెలుస్తోంది ఏదో పనుండి వచ్చేడని – అని లోపలనుకుంటూ అన్నారు.

"నేనొచ్చి అరగంట పైనే అయింది లెండి"

"అరె! అలాగా. మావల్ల ఆలస్యమేమీ జరగలేదుకదా?" లోపల తిట్టుకుంటూ పైకి నొచ్చుకుంటున్నట్టు మొఖం పెట్టి అన్నారు.


"అబ్బెబ్బే. అదేం కాదండి. మీరొచ్చి కాలేజీ అవతారాన్ని మార్చేశారని చాలా విన్నానండి. అదేమిటో చూద్దామని అన్ని డిపార్ట్‌మెంట్లకీ వెళ్ళి అన్నీ చూసి వస్తున్నాను. మీరు చేతల మనిషని గ్రహించి అభినందిద్దామని వచ్చేను."

చిదంబరం కొంచెంగా వుబ్బేరు.

"పెద్దవారు మీలాంటివారి ప్రోత్సాహం వుంటే చాలా చాలా చెయ్యగలను. ఇంతవరకూ చేసింది పిడికెడంత. ఇంకా చెయ్యాల్సింది ఆకాశమంత."

"నిజమే కాని వెయ్యిమైళ్ళ ప్రయాణమైనా మొదలయ్యేది మొదటి అడుగుతోనే. చెయ్యాలన్న తపన, చెయ్యగలనన్న నమ్మకం వుండటం ముఖ్యం. అవి మీలో





పుష్కలంగా వున్నాయి. అందుచేత ఆకాశమంత పనైనా సరే అవలీలగా చేసెయ్యగలరని నేను ధీమాగా చెప్పగలను."

"అదంతా మీ అభిమానం" చిన్నగా మందహాసం చేస్తూ అని బజ్జర్ మ్రోగించి ప్యూన్‌తో రెండు కాఫీలు పట్రమ్మన్నారు.

"ఇదివరకు కాలేజీకాంపౌండ్లో అడుగు పెడితే అంతా చిందరవందరగా వుండేది. ఎక్కడ బడితే అక్కడ సైకిళ్ళు నిలబెట్టేసేవారు. గుంపులు గుంపులుగా స్టూడెంట్లు బాతాఖానీ వేసేవారు. మొక్కలు మోడుల్లా వుండేవి. ఇప్పుడదంతా మారిపోయింది. సైకిళ్ళు షెడ్డులోనే వుంటున్నాయి. మొక్కలన్నీ అందంగా, ఆరోగ్యంగా వున్నాయి, వాటికి పువ్వులు కూడా వుండటం ప్రత్యేక విశేషం".

"అందరూ తమ తమ బాధ్యతల్ని సవ్యంగా నిర్వర్తిస్తూండడమే దానిక్కారణం..." తన సంబరం బయట పడకుండా అన్నారు.

"అమ్మమ్మ అలాగనకండి. చేతిలో వున్న అధికారాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోవడం మన దేశపు అధికార్ల మొదటి లక్షణం. ఒత్తిడులకూ, ప్రలోభాలకూ లొంగిపోవడం రెండో లక్షణం. ఆ రెంటికీ మీరు మినహాయింపని చెప్పక తప్పదు. ఇకపోతే ఏ అధికారైనా తనొక్కడూ సరిగ్గా పనిచేస్తూ నీతిగా వుంటే సరిపోదు. తన క్రిందివారందర్నీ సవ్యంగా, సక్రమంగా బాధ్యతాయుతంగా, నీతివంతంగా ప్రవర్తించేట్లు చూడటం అత్యంత ముఖ్యం. ఆ సంగతి గ్రహించి ఆచరణలో పెట్టిన మిమ్మల్నెలా అభినందించాలో తెలీడంలేదు."

"మీలాంటి పెద్దల ఆశీస్సులు పొందగలిగినందుకెంతో ఆనందంగా వుంది."

"లైబ్రరీలో మీరు వ్రేలాడగట్టిన అట్టలమీది స్లోగన్లు చూశాను. ఒకదాని మీద "దేవాలయంలో ధ్యానం గ్రంథాలయంలో జ్ఞానం" అని రాసివుంది. ఇంకో దానిమీద "ఇక్కడ కళ్ళకి మెదడుకీ మాత్రమే పని చెప్పండి" అని రాసివుంది. అబ్బ! ఇంత గొప్ప గోల్డెన్ వర్డ్స్ ఎప్పుడూ, ఎక్కడా వినలేదు, చూడలేదంటే నమ్మండి. ప్రతి గ్రంథాలయంలోనూ మీ యొక్క కొటేషన్స్ రాయించాల్సిన అవసరం ఎంతైనా వుందండీ....."

ఆ ప్రశంసని చిర్నవ్వుతో స్వీకరించారు. అలాటి బోర్డులు వున్నట్టే తెలీదాయనకి. నిజం చెప్పి ఆ ప్రశంసలు తనకి చెందవని చెప్పుకోవాలన్పించలేదు.

కాఫీలొచ్చాయి.

"పెద్దలపైన మీకున్న గౌరవాభిమానాలకీ, మీ వున్నత సంస్కారానికీ ఇది ప్రత్యక్ష నిదర్శనం" అని పొగడి కాఫీకప్పు అందుకున్నారు.

"ఇదివరకు ప్యూన్లూ, గుమాస్తాలూ మాట విన్పించుకునేవారు కాదు. టైమ్ ప్రకారం పని చేసేవాళ్ళు కాదు. అలాటిదిప్పుడు ఎక్కడ చూసినా, ఏటుచూసినా పంక్చువాలిటీ, డిసిప్లిన్. ఓహ్-గొప్పగా మంత్రించినట్టుగా చేసేస్తున్నారు కదండీ"

"మన కాలేజీకో ప్రత్యేకతనీ, గౌరవాన్నీ తీసుకు రావాలని అహరహం కృషి చేస్తున్నానండి. మీ బోటి పెద్దలు తగు సలహాలిస్తే మరింతగా..."


"అమ్మమ్మ! అంతమాటనకండి. మీముందు మేమెంత చెప్పండి? విజ్ఞాన సర్వస్వాలు మీరు. మేం గాలివాటు మనుష్యులం. ఇంకోమాట. మీరేమనుకున్నా సరే చెప్పక తప్పదు. ఇదివరకటి ప్రిన్సిపాల్ ఆ పదవికి అనర్హుడని నెత్తీనోరూ కొట్టుకున్నా సర్వీసు రూల్సు దృష్ట్యానూ కమిటీ చైర్మన్ మనిషవడం వల్లనూ మిగతావాళ్ళు నాతో పూర్తిగా ఏకీభవించలేదు. ఇప్పుడు కాలేజీలో వచ్చిన మార్పు చూస్తోంటే మీ ముందు పనిచేసిన ప్రిన్సిపాల్సంతా ఎంత అసమర్థులో సాక్ష్యాధారాల్తో ఋజువవుతోందనుకోండి"

వుబ్బి తబ్బిబ్బయ్యారు చిదంబరం.

"మిమ్మల్ని చాలా విసిగిస్తున్నట్టున్నాను. ఏదో పూర్వకాలంవాణ్ణి. ఇంత ఆనందాన్ని కడుపులో దాచుకోలేక వచ్చేను. మీరు శలవిస్తే శలవు తీసుకుంటాను" లేవబోతూ అన్నారు.

"మీరలా అనకండి. మీబోటివారి సహాయ సహకారాలే మా కాలేజీకి శ్రీరామరక్ష"

"అన్నట్టు నే వస్తోంటే మావాడేదో కనుక్కోమని చీటీ ఇచ్చాడండీ...." అంటూ జేబులు వెతికినట్టు వెతికి ఓకాగితం తీసిచ్చారు. "అక్కడికీ అన్నాను. నేను



తీసుకెళ్ళటం బావోదురా. నువ్వెళ్ళి ప్రిన్సిపాల్‌గార్ని కలిస్తే క్షణాల్లో పని చేసిపెడతారూ అవటాని..."

"ఇప్పుడైతే ఏంలెండి. ఒక్కక్షణం కూర్చోండి...." అని చెప్పి హెడ్ క్లర్కుని పిలిచి క్షణంలో పని చేయించి కాగితం చేతిలో పెట్టేశారు చిదంబరం.

కృతజ్ఞతలు చెప్పి ఋంటికొచ్చి ఆ కాగితం కొడుక్కిచ్చారు శ్రీపతిరావుగారు.

అతడమితాశ్చర్యంతో "ఇన్నాళ్ళు తిరిగినా నేను చేయించుకోలేనిది - కనీసం కదపలేనిది మీరు చేయించుకొచ్చారంటే నమ్మలేక పోతున్నాను. మీరెలా సాధించగలిగారు నాన్నగారూ" అనడిగాడు.

"సహస్ర నామార్చన పూజరా. ధూపదీప నైవేద్యాలు విఫలమైనప్పుడు వదలాల్సిన పాశుపతాస్త్రంరా" అని నవ్వేరాయన.

•••